సీరియల్

వి.యస్.రావ్

అన్వేషణ

(గత సంచిక తరువాయి)

"మనోజ్ ...." విరూపాక్షరావు అడ్డు తగిలాడు.

"అడ్డురాకు. నోరు మూసుకుని, చెవులప్పగించి విను! నీ అనుచరుల బృందగానం వింటే నువ్వు గుండె ఆగి చస్తావ్. ఆ బృందగానంతో పాటు ఇతర వివరాలన్నీ, అయిదు నిమిషాల క్రితమే నా శ్రేయోభిలాషి చేతికి చేర్చాను. నేను గంటలోగా క్షేమంగా అతడ్ని కలుసుకోకపోతే, అతన్ను తిన్నగా క్రైంబ్రాంచి అధికారుల్ని కల్సుకుని కథ వల్లిస్తాడు. అంచేత కేవలం డబ్బుతో మాత్రం నువ్వు యిక్కడికి రావాలి! అర్థమైందా?"

"నువ్వు చెప్తోందంతా నిజమే అని తేల్చుకున్నాక, నీకు ఎంతో కొంత యివ్వడానికి ప్రయత్నిస్తాను ..." విరూపాక్షరావు బింకంగా అన్నాడు.

"చెప్పిందంతా నిజమే అని చిటికలో నిరూపిస్తాను. అదలా వుంచు. ఎంతో కొంత కాదు; అడిగినంతా యిస్తాన్! ఇదిగో, నీ శిష్యుడు పోతరాజు నీతో మాట్లాడుతాడు...." అంటూ మనోజ్ టెలిఫోన్ని పోతరాజు దగ్గరగా తీసుకెళ్ళాడు. రిసీవర్ని, కిల్లికిలా పడున్న పోతరాజు నోటికీ, చెవికీ సర్దిపట్టుకున్నాడు. పోతరాజు వెంటనే ప్రారంభించాడు.

"బాస్ .... బాస్ .... అతనడిగింది ఇచ్చేసి మమ్మల్ని తీసికెళ్ళండి! ఆలస్యం చేయకండి...."

"........ ...."

"బౌస్ .... బాస్. సందేహంలేదు. మళ్ళా వాళ్ళ చేతుల్లో ఇరుక్కోవడం మనకి ప్రమాదం. ప్రాణాలకోసం మేం అంతా కక్కేయాల్సి వుంటుంది....! బాస్.... త్వరగా...."

"........ ...."

పోతరాజు వొంగినించున్న మనోజ్ ని మెరుస్తున్న కళ్ళతో చూశాడు. "బాస్ నీతో మాట్లాడుతాడు...."

"యస్?" రిసీవర్ని తన చెవికి ఆనించుకుంటూ అన్నాడు మనోజ్.

"వస్తాను. అడిగింది ఇస్తాను. ఆ తరవాత మోసం చేయవుగా!" విరూపాక్షరావు కంఠం సందేహిస్తూ అడిగింది.

"విరూపాక్షరావ్, మోసం నీ ఇంటి పేరు! ప్రశ్నలు అడుగుతూ బేరాలు చేస్తూ వాగ్దానాలు చేయించే స్థితిలో నువ్వు లేవు! అది గుర్తుంచుకో, ఇందాకా నే నిచ్చిన యే హెచ్చరికని నువ్వు నిర్లక్ష్యం చేసినా. నీ శిష్యుల్ని రాబందులు తన్నుకుపోతాయ్! ఇంకా నలభై నిమిషాలు

కూడా లేదు! క్విక్!" అంటూ మనోజ్ రిసీవర్ని క్రెడిల్ మీద పడేశాడు. నవ్వుతూ పోతిరాజునీ, జాకీనీ చూశాడు.

వాళ్ళ కళ్ళల్లో ఏదో ఆశ్చర్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఇందాకటి కంగారు కొద్దిగా తగ్గినట్టు వాళ్ళ చూపులు చెప్తున్నాయి. మనోజ్ మరో సిగరెట్ వెలిగించాడు....

• • •

టవర్ క్లాక్ సమీపంలో, రోడ్డువారగా కారు ఆగింది.

ఇంజన్ని ఆఫ్ చేసి, డోరు తెరుచుకుని అతను దిగాడు. వెనుక డోర్ తెరిచి, సీటుమీదున్న నల్లటి సూట్ కేస్ ని ఇవతలికి లాగాడు. రెండు డోర్లూ మూసి తాళం వేసి పళ్ళమధ్య ఇరుక్కున్న ఆరిపోయిన పైప్ ని తీసి బోనెట్ మీద టకటక కొట్టి బూడిదని రాల్చేశాడు.

ఖాళీ చేసిన పైప్ ని కోటు జేబులో పడేసుకుని రోడ్డుమ్మట నడక ప్రారంభించాడు. డిక్కీలో నక్కి దాక్కున్న హనుమాన్ టకటక శబ్దాన్ని విని వుంటాడు.

చేతిని కిందికి లాగుతున్న సూట్ కేసుని మరో చేతిలోకి మార్చుకుంటూ అతను బరువుగా అడుగులేస్తున్నాడు. అతను తటాలున ఆగాడు. అతని గుండె దడదడ కొట్టుకుంది. వెనుక మెత్తగా అడుగుల చప్పుడు!

అతను మెల్లగా తలతిప్పి వెనక్కి చూశాడు. రోడ్డు మీద ఎవ్వరూ లేరు. దూరంలో తన కారు నల్లగా అవుపిస్తోంది. అడుగుల చప్పుడుని తను ఊహించుకున్నాడు! ధైర్యంగా నిట్టూరుస్తూ అతను నడక ప్రారంభించాడు. రోడ్డు నిర్మానుష్యంగా వుంది. ఏ వాహనాలు తిరగడం

లేదు. అతను మళ్ళీ ఆగాడు. దూరం నుంచీ ఏదో చప్పుడు లీలగా వినిపించింది. అతను తిరిగిచూడలేదు. అది తన కారు డిక్కీ మూసుకున్న చప్పుడని అతనికి తెలుసు! హనుమాన్ అలర్ట్‌గా వున్నాడు....

కాసేపట్లో రోడ్డుకి ఎడమవైపున్న గేటు ముందు అతను ఆగాడు. బరువుగా వున్న సూట్ కేస్ తనని కింద పెట్టేయమని చెప్తోంది. నుదుర్ని కమ్మిన చెమట తుడుచుకుని, అతను గేటుమీద చెయ్యి వేశాడు. అతని వొళ్ళు వొక్కసారి జలదరించింది. శరీరంమీద వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి. మెడమీద యేదో చల్లగా తాకింది....

"విరూపాక్షరావ్, సూట్ కేసుని నెత్తిమీద పెట్టుకుని, రెండు చేతుల్తో పట్టుకో; రైల్వే పోర్టరులా. కదలకుండా నుంచో!" వెనకనుంచీ సన్నటి కంఠం స్పష్టంగా హెచ్చరించింది. మెడ దగ్గరగా సేఫ్టీ కాచ్ రిలీజ్ అయిన చప్పుడు అతనికి వినిపించింది.

అప్రయత్నంగా గేటుమీదున్న చేతిని తీసి, సూట్ కేసుని తలమీద పెట్టి పట్టుకున్నాడతను. వెనుక నుంచీ యేదో చెయ్యి అతని కోటు జేబుల్నీ, పాంటు జేబుల్నీ తడుముతోంది.

"ఆల్ రైట్. కాలితో గేటుని తోస్తూ కదులు!" వెనుక నుంచీ హెచ్చరించింది మనోజ్ కంఠం.

రివాల్వర్ని జేబులో వేసుకోనందుకు సంతోషిస్తూ విరూపాక్షరావు సూట్ కేసు మోస్తూ ముందుకి కదిలాడు. రివాల్వర్ కొన మెడమీంచీ వీపు వెనుక భాగంలో, గుండె సరిహద్దుల్లోకి పాకి, ఆగింది.

రెండు నిమిషాల్లో మనోజ్ అతన్ని గుమ్మం దాటించి

హాల్లోకి, అక్కణ్నుంచి గదిలోకి తోలుకెళ్ళాడు. తిరగేసిన బెంచీల్లో ఇరుక్కున్న తన శిష్యుల్ని వెంటనే గుర్తించలేక పోయాడతను.

"నెత్తిమీది బరువుని టేబుల్ మీదికి దించి, చేతుల్ని వెనక్కి పెట్టుకో!" మనోజ్ ఆజ్ఞాపించాడు.

"మనోజ్, నీకు కావాల్సింది తెచ్చాను. నన్ను విసిగించకు!" సూట్ కేస్ ని టేబుల్ మీద పెడుతూ విసుగ్గా కసిరాడు విరూపాక్షరావు.

"మాట్లాడకు! చెప్పింది చెయ్!"

గేటుదగ్గర అతని జేబులోంచి తీసుకున్న తాళంచెవిని విరూపాక్షరావు చేతిలో పెట్టాడు మనోజ్.

"విరూపాక్షరావ్. నీ సూట్ కేసుని నీ స్వహస్తాలో తెరు! తాళం తెరిస్తే పేలేలా యేదేనా యేర్పాటు చేశావేమో చూద్దాం!" మనోజ్ నవ్వుతూ అన్నాడు.

"పిచ్చిగా మాట్లాడకు" విరూపాక్షరావు కోపంగా ప్రారంభించాడు.

"నోరు మూసుకో! తాళం తెరు!"

విరూపాక్షరావు కిక్కురుమనకుండా తాళం తెరిచాడు. నిండుగా పేర్చిన వందరూపాయల నోట్లకట్టల్ని తలవాల్చి చూశాడు మనోజ్.

"ఆల్ రైట్! చేతుల్ని వెనుక పెట్టుకో!"

విరూపాక్షరావు బుసకొడుతూ చేతుల్ని తన వెనక్కి పోనిచ్చాడు. అతని రెండు మణికట్లకీ యేదో చల్లగా, గట్టిగా తగిలింది. క్లిక్కుమన్న చప్పుడైంది.

"మనోజ్, ఏమిటిది?" విరూపాక్షరావు కోపంగా అరిచాడు; తన చేతుల్ని బంధించినవి బేడీలని గ్రహించి.

మనోజ్ అతని ముందుకి జరిగి నవ్వుతూ చూశాడు.

విరూపాక్షరావు మొహం కందగడ్డలా వుంది. చెమట బిందువులుగా మెరుస్తోంది. కళ్ళల్లో ఎర్రజీర అతని ఆగ్రహానికి గ్రాఫులా వుంది.

“విరూపాక్షరావ్, నువ్వు ఆరితేరిన ఘటమని నాకు తెలుసు. నాలాంటి అమెచూర్స్‌ని అవలీలగా బోల్తా కొట్టించగలవు! నువ్వు నా హెచ్చరికని అలక్ష్యం చేశావు ...”

విరూపాక్షరావు అర్థంకానట్టు చూశాడు.

“కారు డిక్కీలో నీ తోక—హనుమాన్‌ని దాచి తెచ్చావ్! ఆ అపరాధానికి శిక్ష బేడీల రూపంలో నీ చేతుల్ని తగులుకుంది!” మనోజ్ చూపులు సూదుల్లా విరూపాక్షరావు కళ్ళలోకి గుచ్చుకున్నాయి.

విరూపాక్షరావు కనుబొమలు పైకి లేచాయి. క్షణంలో రెప్పలు వాలిపోయాయి. అయితే డిక్కీని చప్పుడు చేసింది హనుమాన్ కాదన్న మాట! అతనిలో ఆశ్చర్యంగా ఆలోచనలు సాగుతున్నాయి.

“విరూపాక్షరావ్, నీ శిష్యులిద్దర్నీ, నీ పర్సనల్ ఫిజిషియన్నీ చూడవూ?” మనోజ్ కంఠం వెటకారంగా అతన్ని హెచ్చరించింది.

అతను తలెత్తాడు. బెంచీల్లోపల బల్లుల్లా అతుక్కున్న పోతరాజూ, జాకీ ఆత్రంగా అతన్నే చూస్తూన్నారు. వాళ్ళ కళ్ళల్లో భయం, ధైర్యం రెండూ అవుపిస్తోన్నాయి. విరూపాక్షరావు చూపులు కుర్చీలో అచేతనంగా కూచున్న డా॥ సంజీవరావువేపు తిరిగాయి. అతని మొహంమీద ఎండిపోయిన ఎర్రటి చారికలు భయంకరంగా వున్నాయి. డా॥ సంజీవరావు అతన్ని రెప్ప వేయకుండా చూశాడు.

"రావుగారూ, విగ్రహంలా నుంచోకండి. అతనికి కావాల్సింది పారేసి, ఇక్కణ్నుంచి పంపేయండి!" వణికే కంఠంతో ఆత్రంగా అన్నాడతను.

తన అనుచరుల్ని మరోసారి హీనంగా చూశాడు విరూపాక్షరావు. అతని మొహం బిగుసుకుపోయింది. దెబ్బ తిన్న వాలకంతో మనోజ్ ని తదేకంగా చూశాడతను.

"పాతిక లక్షలు. ఎందుకో, వాళ్ళని—మమ్మల్ని వదిలెయ్!" అన్నాడతను ఆగ్రహాన్ని దిగమింగుతూ.

మనోజ్ చిన్నగా నవ్వాడు. "పాతిక లక్షలు ఒకటో పరతు మాత్రమే! రెండోదాన్ని మరచిపోతున్నావ్!"

"ఏమిటది? డోంట్ వేస్ట్ టైమ్!" విరూపాక్షరావు ఉరుముతూ చూశాడు.

మనోజ్ అతని యెదురుగా టేబుల్ మీద కూచుని, కాళ్ళని వూగించాడు. విరూపాక్షరావుని తదేకంగా చూశాడు.

"డా॥ సంజీవరావు సప్లై చేసిన సైనైడ్ ని మా వదిన పాలగ్లాసులో కలిపినట్టు హోతరాజా, జాకీ వొప్పుకున్నారు. గీతని మానభంగం చేసి, తలగడా నొక్కిపట్టి హత్య చేసినట్టూ, అదంతా మా అన్నయ్య చేసిన విధంగా చిత్రించినట్టూ యుగళగీతం పాడుతూ అంగీకరించారు. అలాగే అమాయకంగా నీ కోసం సాక్ష్యం పలికిన బలహీనుల్ని సంహరించినట్టూ వాళ్ళు వొప్పుకున్నారు. చచ్చిపోయిన బాబ్జీ అడ్వొకేట్ అన్నారావుని హతమార్చిన విషయం కూడా వాళ్ళు ప్రమాణ

పూర్వకంగా చెప్పారు.

ఒక్క ముక్కలో చెప్పాలంటే, ఎవరెవర్ని ఎవరెవరు ఎప్పుడు ఎలా చంపారో వాళ్ళు—పాపం—చాలా విశదంగా వివరించారు. కానీ, అడ్వొకేట్ కరుణాకర్ భార్యనీ, గీతనూ చంపి, ఆయన జెయిలుపాలయ్యేలా నాటకం యెందుకు ఆడబడిందో వాళ్ళు చెప్పలేకపోయారు...." మనోజ్ ఆగి, సిగరెట్ వెలిగించాడు.

విరూపాక్షరావు మొహంమీది గాంభీర్యత మాయమైపోయింది. అతను తన చూపుల్ని పోతిరాజువైపు తిప్పాడు. ఆ చూపుల్లో ప్రత్యక్షమవుతున్న క్రోధం, ఆవేశం మనోజ్ చూపుల్నుంచీ తప్పించుకోలేకపోయాయి.

"బాస్.... అయామ్ సారీ.... కరెంట్ ఇస్త్రీ పెట్టెతో మమ్మల్ని సాఫీ చేయబోయాడతను.... చెప్పక తప్పలేదు........" పోతిరాజు సంజాయిషీ యిచ్చాడు.

పాము బుసలా విరూపాక్షరావు నిట్టూర్చాడు. చూపుల్ని మనోజ్ వైపు తిప్పాడు.

"నీ రెండవ కోరిక...."

"కోరిక కాదు: కండిషన్!" మనోజ్ నవ్వుతూ అన్నాడు. "ఇంతకాలం జరిగిన హత్యలూ అన్యాయాలూ—నీ పథకమే అని తేలింది. చాలా బలమైన కారణం వుంటేగానీ యిలాంటి దారుణ చర్యని ఎవరూ ప్లాన్ చేసి అమలు జరపరు! మా అన్నయ్యకి నువ్వు చాలా, చాలా పెద్ద శిక్ష విధించావు. ఎందుకు?"

విరూపాక్షరావు పెదిములు చివర్లో కొద్దిగా కది

లాయి. "మనోజ్, నా మనుషులు నీ టార్చర్ని భరించలేక యేవేవో వాగిస్తున్నారు. ఆ వాగడం నీకు నచ్చేలా వాగిస్తున్నారు! అనవసరంగా నువ్వు నన్ను అనుమానిస్తున్నావు నిజం...."

"విరూపాక్షరావ్, అనవసరంగా మాట్లాడితే అలసిపోతావ్! నాకు చాలా చాలా తెలుసని నీకు తెలీదు. నీ డాబుసరీ, హుందా, ఐశ్వర్యం అంతా చూసి, నిజాన్ని యెదుర్కొనే గుండె నిబ్బరం నీలో వుందని అపోహపడ్డాను!" మనోజ్ వెటకారంగా అన్నాడు.

"మనోజ్!"

"విరూపాక్షరావ్, నిద్ర నటించొద్దు; నీ రహస్యాలన్నీ నా గుప్పిట్లో వున్నాయి. గుప్పిట తెరిస్తే నీ గుట్టు రట్టయి, నీ ఆట కట్టవుతుంది. అంచేత మేల్కొని ఆలోచించు! నాశనమైపోయిన నా అన్నయ్య జీవితం యింక బాగుపడదు. చచ్చిపోయిన మా వదినా, గీతా తిరిగి రారు. అలాగే అన్నారావూ, అతని తల్లీ నీ చర్య నాకెంతో నష్టాన్ని కలిగించింది. ఆ నష్టాన్ని పూడ్చడానికే నేను నిన్ను చదివింపులు చేయమన్నాను. ఆ పాతిక లక్షలు ఆ నష్టాన్ని కొద్దిగా పూడ్చగలవు తతిమ్మాదాన్ని నువ్వు మరో విధంగా పూడ్చాలి...."

"ఏ విధంగా?...." విరూపాక్షరావు అడ్డు తగిలాడు.

"మా అన్నయ్యని యిలా సర్వనాశనం యెందుకు చేశావో నాకు తెలియాలి. అది నువ్వు చెప్తావ్!"

విరూపాక్షరావు నమ్మలేనట్టు చూశాడు. కనిపించని బోను కోసం వెతికే ఎలుకలా అతని కళ్ళు మనోజ్ మొహంలోకి చూశాయి.

"అంతేనా?"

"అంతే! ఆ విషయం తెలుసుకోడానికే ఇంత కాలం నేను వెటాడాను. నా అన్వేషణ నన్ను నీ దగ్గరకు చేర్చింది. ఏ కారణం నీ చేత యింత ఘోరం చేయించిందో తెలుసుకోవాలన్న కోరిక నాలో బలంగా కలిగింది. ఏమిటది?"

విరూపాక్షరావు రెప్ప వేయకుండా చూశాడు. "చెప్పే నీ మాట నిలబెట్టుకుంటావని గ్యారంటీ యేమిటి?"

మనోజ్ సిగరెట్ పీకని కింద పడేశాడు. నవ్వుతూ అతన్ని చూశాడు. "గ్యారంటీ యేమీ లేదు. గ్యారెంటీ కోసం నువ్వు నాతో బేరం చేయలేవు కూడా! నువ్వు యిచ్చిన డబ్బుతో, చెప్పబోయే 'నిజం'తో తృప్తిపడి నా దారిన నేను పోతాను. విరిగిపోయిన పాలని పూర్వ స్థితికి తీసుకురాగలనన్న నమ్మకం నాకు లేదు! మా అన్నయ్య జీవితాన్ని మునుపట్లా చేయలేను. ఎవ్వరూ కాలాన్ని వెనక్కి తిప్పలేరు! నా శ్రమకి పారితోషికం లభించాక, నిన్నూ, అన్నయ్యనూ మరచిపోయి నా దారిన నేను పోతాను. శాంతిగా జీవితం గడపాలని నాకుంది. కేసులూ, కోర్టులూ—ఈ రొచ్చులో దిగే కోరిక నాకు లేదు!"

విరూపాక్షరావు తటపటాయించాడు. "మనోజ్, మీ అన్నయ్యకు ద్రోహం చేసినవాళ్ళని అంతం చేయాలని నాతో అన్నావు. ఆ ప్రతీకార వాంఛ యేమైంది? దాన్నంతా ఎందుకు మరచిపోతున్నావ్?"

"పాతిక లక్షల కోసం....!" మనోజ్ నవ్వుతూ అన్నాడు.

విరూపాక్షరావు అతని కళ్ళల్లోకి వెతుకుతూ

చూశాడు. రెండు క్షణాల తర్వాత అతని కళ్ళు నవ్వాయి ఆ నవ్వు అతని పెదాలమీదికి పాకింది.

"మనోజ్, నువ్వు తెలివైనవాడివి. కంగ్రాట్స్;" అన్నాడు నవ్వుతూ. మనోజ్ ప్రశ్నార్థకంగా చూశాడు.

"డబ్బు విలువ నీకు తెలిసినంతా మీ అన్నయ్యకు తెలీదు!" విరూపాక్షరావు మెల్లిగా అన్నాడు.

"వాట్?"

"యస్!" విరూపాక్షరావు నవ్వుతూ అన్నాడు. "కరుణాకర్ డబ్బును గడ్డిపరకలా చూశాడు. డబ్బున్న, డబ్బు విలువ తెలిసిన నన్ను నిర్లక్ష్యం చేశాడు; అవమానించాడు!"

మనోజ్ మాట్లాడకుండా ఆశ్చర్యంగా చూస్తూ వుండిపోయాడు.

"నా మేనల్లుడు ఒక కేసులో యిరుక్కున్నాడు. పిల్లలు లేని నాకు వాడే సర్వస్వం. దురదృష్టవశాత్తూ వాడు చేసిన నేరం ఒక రకంగా తీవ్రమైందే. నా శ్రేయోభిలాషులైన నలుగురు లాయర్లు వారికి ఉరి-శిక్షో, జీవితఖైదో పడుతుందన్నారు. వాడిని కోర్టులో డిఫెండ్ చేయడానికి చాలా చాకచక్యం కలిగిన లాయర్ కావాలన్నారు. అందరూ కరుణాకర్ని రికమెండ్ చేశారు. కేసుని స్వయంగా టేకప్ చేయడానికి వాళ్ళు జంకారు. నా కేసు నోడిపోవడం నాకు--గే వాళ్ళకీ యిష్టంలేదు...." విరూపాక్షరావు ఆగి, మళ్ళీ ప్రారంభించాడు.

"నా తరఫున వాళ్ళు కరుణాకర్ని కలుసుకున్నారు. కేసు వివరించారు. బోలెడంత ఫీజు ఆఫర్ చేశారు. కానీ

కరుణాకర్ తిరస్కరించాడు. అపరాధం చేసిన వ్యక్తి తరఫున తను వాదించనన్నాడు. అంతవరకూ తెర వెనకన్న నేను బైటపడి, స్వయంగా అతన్ని కలుసుకున్నాను. బ్రీఫ్ కేస్‌లో నోట్లు పట్టుకెళ్ళాను. అతను యింకా బలంగా నిరాకరించాడు. ధనమదాంధుల కోసం తను ప్రాక్టీస్ పెట్టలేదన్నాడు. అతన్ని బతిమాలాను.

తప్పు చేసిన వ్యక్తి తప్పించుకోడం అనాదిగా జరుగుతోందనీ, కేసు తీసుకుని నా మేనల్లుడికి శిక్షపడకుండా చూడమనీ అర్థించాను....”

విరూపాక్షరావు ఆగాడు. జ్ఞాపకాలు అతని మొహాన్ని జేవురింపజేశాయి. కళ్ళు వజ్రాల్లా కఠినంగా అయ్యాయి. ఆనాటి అవమానం అతని మొహమ్మీద సుద్దతో రాసినట్టు కనిపిస్తోంది. మనోజ్ నోరు మెదపకుండా చూస్తున్నాడు.

“మనోజ్, జీవితంలో మొదటిసారి నేను మొదటి వాణ్ని అభ్యర్థించాను. జీవితంలో మొదటిసారి తిరస్కరించబడ్డాను. అయినా తమాయించుకుని కూడా తెచ్చిన రెండు లక్షల్ని అతనిముందు పెట్టాను. డబ్బు తనని కొనలేదన్నాడతను గర్వంగా. డబ్బు సంపాదించగలిగింది చాలా తక్కువ అన్నాడతను ఎగతాళిగా. ఎడంచేత్తో అతను గిరాటేసిన నా బ్రీఫ్ కేస్‌లోని నోట్లకట్టలు నా పాదాల చుట్టూ పడ్డాయి. వొంగి వాట్ని ఏరుకున్నాను. చివరిసారిగా అడిగాను.

“తను కేసు టేకప్ చేస్తే నా మేనల్లుడికి తప్పకుండా తగిన శిక్షపడేలా చూస్తానన్నాడతను ఎగతాళిగా నవ్వుతూ. నా డబ్బుని గిరాటేసి నా కోరికని నిర్లక్ష్యం చేసి, ఎగతాళిగా నన్ను చూసి నవ్విన మొట్టమొదటి

వ్యక్తిని ఆ రోజు మొట్ట మొదటిసారిగా చూశాను.

"మౌనంగా అక్కణ్ణుంచీ వెళ్ళిపోయాను. 'డబ్బుతో న్యాయాన్ని కొనలేవు!' కరుణాకర్ డైలాగ్ నా గుండెలో చాలా రోజులు, అనుక్షణం మారుమ్రోగుతూ వుండిపోయింది. రెణ్నెల్ల తర్వాత నా మేనల్లుడికి యావజ్జీవ కారాగార శిక్ష పడింది. నెలతిరక్కముందే వాడు జైల్లో మరణించాడు. వాడు భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడని నాకు తెలుసు!

"ఆ క్షణంనుంచీ, నాలో మీ అన్నపట్ల యేర్పడి నిద్రపోతున్న ప్రతీకారం మేల్కొని, పడగెత్తి బుస కొట్టడం ప్రారంభించింది. పగ నా రక్తంగా మారి ప్రవహించడం ప్రారంభించింది. డబ్బు న్యాయాన్ని కొనగలదని నిరూపించాలనుకున్నాను. కానీ వెంటనే రంగంలోకి దిగలేదు. మీ అన్నయ్య నన్నుగురించి పూర్తిగా మరిచిపోడానికి మూడేళ్ళ వ్యవధి ఇచ్చాను. తర్వాత బ్రహ్మాండంగా ప్లాన్ చేసి నాటకం నడిపాను. డబ్బుతో న్యాయాన్ని కొన్నాను!"

విరూపాక్షరావు ఆగి, సగర్వంగా చూశాడు. అతని మొహం చెమటతో మెరుస్తోంది. కళ్ళు రాక్షస సంతృప్తితో తళతళమంటున్నాయి. మనోజ్ అర్థమైనట్టు తలాడించాడు.

"ఎవరు చేశారో తెలీకపోయినా, తన విషయంలో డబ్బు న్యాయాన్ని కొనేస్తోందన్న సత్యం మీ అన్నయ్యకు తట్టివుంటుంది" విరూపాక్షరావు ముగించి నవ్వాడు.

మనోజ్ నిట్టూర్చాడు. "విరూపాక్షరావ్. చిన్న తప్పుకి పెద్ద శిక్ష—చాలా పెద్ద శిక్ష విధించావు నువ్వు!"

విరూపాక్షరావు తల అడ్డంగా ఆడించాడు. "అతని తిరస్కారం నన్ను గాయపరిచింది. అతని నిరాకరణయుతమైన నా మేనల్లుడిని, తల్లీ తండ్రీ ఇద్దరూలేని నా మేనల్లుడిని బలితీసుకుంది! ఆ రెండింటికీ కలిపి, తగిన శిక్ష విధించాను! మనోజ్, నాకు నిన్ను చూస్తూంటే సంతోషంగా వుంది. ఏ డబ్బుని మా అన్నయ్య నిర్లక్ష్యం చేసి అగౌరవించాడో, ఆ డబ్బుని నువ్వు గౌరవించావు! నాకు తెలిసినట్టే డబ్బు విలువ నీకు తెలుసు! కంగ్రాట్స్!" అన్నాడతను నవ్వుతూ.

మనోజ్ నిలబడ్డాడు విరూపాక్షరావుని చూశాడు. "విరూపాక్షరావ్, ధైర్యంగా నిజం చెప్పినందుకు మెచ్చుకుంటున్నా. నన్ను కంగ్రాచ్యులేట్ చేసిన నిన్ను ఒకటి అడుగుతాను. దానికి నువ్వు అంగీకరిస్తే మన పని పూర్తవుతుంది. నీ దారి నీది; నా దారి నాది!"

"ఏమిటది?" విరూపాక్షరావు ఆశ్చర్యాన్ని దాచుకోలేకపోతూ అడిగాడు.

"గతాన్ని తవ్వడం దండగని నేను తెలుసుకున్నా. ఇంటిని కాల్చిందెవరో తెలుసుకోడంవల్ల లాభంలేదు. దాన్ని బాగుచేసుకోవాలి. నేను ఎలాగో మా అన్నయ్య శిక్షని తగ్గించడానికి ప్రయత్నిస్తాను. అందుకోసం ధారాళంగా వ్యయం చేస్తాను. ఆ ప్రయత్నంలో నువ్వు నాకు అడ్డుతగలనని హామీ ఇవ్వాలి. హామీ యిచ్చి మాట తప్పితే, అప్పుడుకూడా నేను నీ భాగోతాన్ని బహిరంగం చేస్తాను...."

విరూపాక్షరావు ఘొల్లున నవ్వాడు. "నేను అనుకున్న కసి తీర్చుకున్నాను. జీవితాంతం అతను జెయిల్లో మగ్గినా, జీవచ్ఛవంలా రోడ్లమీద బతికినా—నాకేం

అభ్యంతరం లేదు. నాకు రెండూ ఒకటే! నా దృష్టిలో, నన్ను అవమానించి రెచ్చగొట్టిన ఆ వ్యక్తి యేనాడో మరణించాడు.

మనోజ్ తలపంకించాడు. "అయితే ఇంతకుముందు అప్పీలు వెళ్ళబోతున్న లాయర్ రంగనాథంని ఎందుకు బెదిరించావు?"

"అతను కానీ, మరొకడు కానీ లోపలికంటా తవ్వుకుంటూ వెళ్ళి, నన్ను కెలకడం నాకు ఇష్టంలేదు. ఇప్పుడు నువ్వు అంతా తెలుసుకున్నావు. ప్రస్తుత పరిస్థితి వేరు! గతంతో, నాతో అవసరంలేదని నువ్వు పాతిక లక్షలు తీసుకుంటూ నిరూపిస్తున్నావ్!" విరూపాక్షరావు నవ్వుతూ అన్నాడు.

"విరూపాక్షరావ్. నువ్వు వచ్చిన పని అయ్యింది. ఇక నువ్వు వెళ్ళొచ్చు...."

"వాళ్ళు?" విరూపాక్షరావు అడుగగిలాడు ఆత్రుతగా. మనోజ్ నవ్వాడు. "వాళ్ళుకూడా. అన్నట్టు డిక్కీలో తలబొప్పికట్టి స్పృహలేకుండా పడున్న హాను మాన్‌ని కూడా నువ్వు తీసికెళ్ళొచ్చు..." అంటూ మనోజ్ వాచీ చూసుకున్నాడు.

తలుపు చప్పుడైంది.

విరూపాక్షరావు ఉలిక్కిపడి తలతిప్పి చూశాడు. అతని కళ్ళు విచ్చుకున్నాయి. ఆశ్చర్యంతో అతని నోరు తెరుచుకుంది.

క్రైమ్‌బ్రాంచ్ చీఫ్ ఆత్మారామ్ గదిలోపలికి వస్తున్నాడు. అతని వెనకే నలుగురు సీనియర్ పోలీస్ ఆఫీసర్లూ, అగడజనుమంది సాయుధ పోలీసులు గదిలోకి దూరారు. విరూపాక్షరావు కళ్ళు చిట్లించాడు. సాయుధ

పోలీసులు ఆరుగురూ బెంచీలకి అతుక్కున్న పోతరాజునీ, జాకీని చుట్టేసి అలర్టుగా నిలబడ్డాడు.

తన యెదురుగా నిలబడ్డ ఆత్మారామ్‌నీ, అతని కిరు వైపులా వున్న యిద్దరు ఇన్‌స్పెక్టర్లనీ వాళ్ళ చేతుల్లో ఇరుక్కుని తనవేపే చూస్తున్న రివాల్వర్లనీ విరూపాక్షరావు అయోమయంగా చూశాడు.

"విరూపాక్షరావ్, చాలా నేరాల వెనక మాస్టర్ మైండ్‌గా వ్యవహరించిన నిన్ను అరెస్టు చేస్తున్నా!" చీఫ్ ఆత్మారామ్ అన్నాడు.

విరూపాక్షరావు నమ్మలేనట్టు చూశాడు. "ఆఫీసర్..., మీరు పొరపాటు చేయబోతున్నారు....నిష్కారణంగా.."

"అసరమైనదానికన్నా అధికంగా కారణాల్ని నువ్వే స్వయంగా చూపించావ్, విరూపాక్షరావ్!" చీఫ్ ఆత్మారామ్ నవ్వుతూ అన్నాడు.

"ఆఫీసర్, నా సంగతి...." ఎర్రటి కళ్ళతో నిప్పులు చెరుగుతూ ప్రారంభించాడు విరూపాక్షరావు.

"పూర్తిగా తెలుసు! నువ్వే వోపిగ్గా వివరించావ్. బెంచీలకి అతుక్కున్న నీ శిష్యులు చాలా కథలు చెప్పారు. పవర్‌ఫుల్ మైక్రోఫోన్స్ సాయంతో పక్క గదిలోంచీ నాతోబాటు ఈ నలుగురు సీనియర్ పోలీ సాఫీసర్లు విన్నారు. నువ్వు పలికిన ప్రతి అక్షరమూ రికార్డు చేయబడింది. నిన్నూ, నీ శిష్యులీ అరడజనుసార్లు ఉరితీయడానికి అవసరమైనన్ని సాక్ష్యాలు మీ ముగ్గురి స్టేట్‌మెంట్స్‌లో, డాక్టర్ స్టేట్‌మెంట్‌లో వున్నాయి! మనోజ్‌కి నువ్విచ్చిన నోట్లకట్టలూ సాక్ష్యం చెబుతాయి." అంటూ చీఫ్ ఆత్మారామ్ ఇన్‌స్పెక్టర్లవైపు చూసి సైగ చేశాడు.

ఇన్స్పెక్టర్ రాధావాధ్, మనోజ్ అందించిన తాళాలతో బేడీల్ని తీసేసి, తన చేతిలోని బేడీల్ని విరూపాక్షరావు చేతులకి తగిలించాడు. విరూపాక్షరావు నిప్పుకణాల్లా వున్న కళ్ళతో మనోజ్‌ని రెప్పవేయకుండా చూస్తూ వుండిపోయాడు. మొహమ్మీద చిరునవ్వు తాండవిస్తోంది. ఆ చిరునవ్వు వేడిగా విరూపాక్షరావు హృదయాన్ని కాల్చుతోంది.

కాసేపట్లో, నైలాన్ తాళ్ళనుండీ విడుదల చేయబడిన పోతరాజా, జాకీ బేడీలతో నిస్సహాయంగా నిలబడ్డారు. మనోజ్ కుర్చీలో కూచున్న డా॥ సంజీవరావు దగ్గరగా నడిచాడు. అతన్ని బంధించిన తాళ్ళని విప్పేశాడు. నవ్వుతూ అతన్ని చూశాడు.

"డాక్టర్! నాటకం పూర్తయ్యింది. మీ మొహానికి వున్న ఎర్ర రంగుని కడిగేసుకోండి. మీ కళ్ళజోడు పగలగొట్టినందుకు చింతిస్తున్నా. థాంక్స్ ఫర్ యువర్ కోఆపరేషన్!"

సంజీవరావు తలాడించాడు.

"ఇన్స్పెక్టర్, వీళ్ళని జాగ్రత్తగా తీసికెళ్ళి లాకప్‌లో భద్రపరచండి!" చీఫ్ ఆత్మారామ్ ఆజ్ఞాపించాడు.

• • •

గదిలో మనోజ్, ఆత్మారామ్ నలుగురు పోలీసాఫీసర్లూ, జయసింహా, అతని పక్కనే ఇందుశేఖర్ కూచున్నారు. టీ తాగడం ముగించి జయసింహా మనోజ్ వైపు నవ్వుతూ చూశాడు.

"మనోజ్, మాట నిలబెట్టావ్. కంగ్రాట్స్!"

"థాంక్యూ సర్. మీకూ ఆత్మారామ్‌గారికీ, ఇందు

లేఖకీ నేను ధన్యవాదాలు చెప్పుకోవాలి. ముఖ్యంగా ఆత్మారామ్‌గారికి. నాకు తెలీకుండా ఆయన నన్ను ఫాలో అయ్యారు. సరైన క్షణంలో తెర వెనుకనుంచీ రంగప్రవేశం చేశారు. ఆయన చాకచక్యం నన్ను ఆశ్చర్యంలో ముంచేసింది!" మనోజ్ ఆత్మారామ్‌వైపు చూస్తూ అన్నాడు.

"ఇటీజ్ నథింగ్! నా ఆఫీసులోంచీ ఆధారాలు సంపాయిస్తానంటూ నువ్వు వెళ్ళాక, సమర్థులైన యిద్దరు వ్యక్తుల్ని నిన్ను నీడలా ఫాలో కమ్మని ఆర్డరిచ్చాను. సమయం చూసి సెట్‌లోకి దూకాం!" అంటూ ఆత్మారామ్ కరోనా సిగార్ వెలిగించాడు. పొగ ఊదుతూ మనోజ్ వైపు చూశాడు.

"మనోజ్, డబ్బుతో, పలుకుబడితో చుట్టూ కంచు కోటలు కట్టుకున్న విరూపాక్షరావు విషవలయాన్ని విచ్ఛిన్నం చేయడంలో నువ్వు ఊహించని విధంగా విజయం సాధించావు. నువ్వే లేకపోతే చట్టం అతన్ని ఇంత త్వరగా బంధించి వుండేది కాదేమో! హృదయ పూర్వకంగా నిన్ను మెచ్చుకుంటున్నా. అన్నట్టు త్వరలో, మీ అన్నయ్య స్వేచ్ఛా వాయువుల్ని పీలుస్తాడు!"

"థాంక్యూ సర్!" మనోజ్ వినయంగా అన్నాడు.

తలుపు చప్పుడైంది. నూరీ డ్రెస్‌లో వున్న రంజన గదిలోకి వస్తోంది. తన తండ్రి జయసింహా పక్కనే కూచుని తలవాల్చి అతని చెవిలో యేదో చెప్పింది. జయసింహ మొహం విప్పారింది. నవ్వుతూ అందర్నీ కలయ జూస్తూ అతను లేచి నిలబడ్డాడు.

"మీ అందరికీ ఒక శుభవార్త! మనోజ్‌కీ, నా

మిత్రుడు స్వర్గీయ అన్నారావు కూతురు ఇందులేఖకీ నా ఆధ్వర్యంలో, నా ఇంట్లో వివాహం జరుగుతుంది!" జయ సింహా సగర్వంగా ఎనౌన్స్ చేశాడు.

అందరూ చప్పట్లు కొట్టారు. ఒళ్ళు మరిచిపోయి ఉత్సాహంతో చప్పట్లు చరుస్తూన్న మనోజ్ ని ఇందులేఖ చిరునవ్వుతో ఓరగా చూడసాగింది.

—: సమాప్తం :—

ఆంధ్ర అపరాధ పరిశోధక సాహితీ ప్రక్రియను అద్భుతంగా రూపొందించిన సాహితీశిల్పి కీ. శే. టెంపోరావుగారికి ఈ నవల అంకితం.

—వి. యస్. రావ్